క్లుప్తంగా

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన

తిరువూరు ఎంఈఓ శ్యాంసుందర్



తిరువూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఆంగ్లభాషను అర్థమయ్యేలా బోధించాలని తిరువూరు ఎంఈఓ శ్యాంసుందర్ అన్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం ఉన్నత పాఠశాలల ఆంగ్లోపాధ్యాయులకు ఇంగ్లిష్ బోధనలో మెలకువలపై శిక్షణ ఇచ్చారు. గ్రామర్ సులభంగా నేర్చుకునే మెలకువలను విద్యార్థులకు తెలియజేయాలని, పరీక్ష విధానాన్ని సమగ్రంగా తెలియజేసి ఎక్కువ మార్కులు సాధించేలా సూచనలివ్వాలని ఎంఈఓ చెప్పారు. జెడ్పీ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీఎస్ఎన్ రాజు, రిసోర్స్ పర్సన్స్ రాంప్రదీప్, రవికాంత్ ఇంగ్లిష్ బోధనపై శిక్షణ ఇచ్చారు. తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ సిబ్బందికి శిక్షణ



మైలవరం: మైలవరం సబ్ డివిజన్‌లోని ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, మైలవరం మండలాల వీఏఏలు, వీహెచ్ఏలు, ఎంపీఈఓలకు శిక్షణ కార్యక్రమం మైలవరం రైతు శిక్షణా కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు యాప్ వాడే విధానంపై అవగాహన కల్పించారు. జిల్లా వనరుల కేంద్రం డీడీఏ టి. మాధవీలత మాట్లాడుతూ పంటలలో పురుగులు, తెగుళ్లను గుర్తించి ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో ఫొటోలు తీసి పెట్టాలన్నారు. వాటిని చూసి శాస్త్రవేత్తలు నివారణ చర్యలను రైతులకు సూచిస్తారని చెప్పారు. గరికపాడు కేవీకే శాస్త్రవేత్త ఎన్. రాజశేఖర్ మాట్లాడుతూ వరి, పత్తి, మొక్కజొన్న, అపరాలను ఆశించే పురుగులు, తెగుళ్లను నివారించే మందులను తెలిపారు. క్షేత్ర సందర్శన చేసి పత్తి, మినుము పంటలను పరిశీలించారు.

ఉచిత బస్ హామీ అమలు చేయాలని ఆందోళన



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన ఉచిత బస్ హామీని నెరవేర్చాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొర్రా కిరణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కొండపల్లి 30వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం ప్లకార్డులు చేబూని ఆందోళన నిర్వహించారు. ట్రాఫిక్ నిలిచిపోయింది. కిరణ్ మాట్లాడుతూ అబద్ధపు హామీలతో మహిళల ఓట్లు దండుకుని చంద్రబాబు గెలిచిన తర్వాత మహిళలకు మొండిచేయి చూపడం అన్యాయమన్నారు. కూటమి నాయకులు ఇచ్చిన ఉచిత బస్ హామీని తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పీసీసీ కార్యదర్శి పోతురాజు ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

విజయవాడ సైబర్ క్రైమ్ ఎస్ఐ శ్రీనివాసమూర్తి



కేతనకొండ(ఇబ్రహీంపట్నం): సైబర్ నేరాలపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని విజయవాడ సైబర్ క్రైమ్ ఎస్ఐ శ్రీనివాసమూర్తి అన్నారు. కేతనకొండ ఆర్కే ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా సైబర్ నేరాలను అరికట్టవచ్చని చెప్పారు. సైబర్ నేరాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న పలు రకాల లింకులపై జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే 1930 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య, ఎస్ఐ ఫణీంద్ర, అధ్యాపకులు పాల్గొన్నారు.

రామాలయంలో తిరువంజన సేవ

తిరువూరు: స్థానిక కోదండ రామాలయంలో శుక్రవారం తిరువంజనం, సేవా కాలం నిర్వహించారు. ఆలయ అర్చకులు పార్థసారధాచార్యులు ఆధ్వర్యంలో సీతారామచంద్రస్వామికి భక్తులు విశేష పూజలు జరిపారు. తిరువంజన అభిషేకంలో 5వ వార్డు కౌన్సిలర్ అనుమోలు రమాదేవి, ముత్తారావు పాల్గొన్నారు.

బార్లను తలపిస్తున్న వైన్ షాపులు

- సిట్టింగ్ కోసం రూమ్ ఏర్పాటు
- పట్టించుకోని ఎక్సైజ్ శాఖాధికారులు
- వాటాల కోసం పోటీ పడుతున్న టీడీపీ నాయకులు



కొండపల్లిలో మద్యం దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన సిట్టింగ్ రూమ్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండల పరిధి, కొండపల్లి మున్సిపాల్టీలో ఏర్పాటు చేసిన ఐదు నూతన వైన్‌షాపులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారు. కొండపల్లి మున్సిపాల్టీకి రెండు, ఇబ్రహీంపట్నం మండల పరిధి గ్రామాల్లో మరో మూడు మొత్తం ఐదు మద్యం దుకాణాలను టెండర్ల ద్వారా ప్రైవేట్ వ్యక్తులు దక్కించుకున్నారు. కొండపల్లిలోనే రెండు దుకాణాలు పక్కపక్కనే ఏర్పాటు చేయడంతో పోటీలు పడి సిట్టింగ్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. బార్లలో మాదిరి విచ్చలవిడిగా మద్యం సేవిస్తున్నారు. రెండు వైన్‌షాపులు 30వ నంబర్ జాతీయ రహదారి పక్కనే ఉండటంతో గొడవలతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వైన్ షాపుల వద్ద బహిరంగంగా గ్లాసులు, వాటర్ బాటిల్స్, స్నాక్స్ వంటివి అందుబాటులో ఉంచారు. నిబంధనలను అతిక్రమించి వైన్ షాపులు నిర్వహిస్తున్నా ఎక్సైజ్ శాఖాధికారులు ఆ షాపుల వైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వెల్లువెత్తున్నాయి.

దేవాలయం సమీపంలో వైన్‌షాప్

మండల పరిధి గుంటుపల్లి, చిలుకూరు రోడ్డు, జూపూడి డొంక రోడ్డులో వైన్‌షాపులను ప్రారంభించారు. జూపూడిలో వైన్‌షాపు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయానికి సమీపంలో ఏర్పాటు చేయడంపై శ్రీవారి భక్తులు, స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఏషాపు వద్ద చూసినా మందుబాబులు తమ వాహనాలను రోడ్లుపైనే నిలిపివేసి బాటసారులు, వాహనదారులకు ఆటంకం కలిగిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వాటాల కోసం నేతల పట్టు

ఇప్పటికే షాపులు దక్కించుకున్న యజమానులు, కూటమి నాయకుల మధ్య విభేదాలు పొడచూపాయి. 30 శాతం వాటా తమకు ఇవ్వాలని టీడీపీ నాయకులు పట్టుబట్టినట్లు ప్రచారం జరుగుతోంది. వాటా ఇవ్వని పక్షంలో గ్రామాల్లో బెల్ట్ షాపుల ఏర్పాటుకు వెనకాడబోమని కూటమి నాయకులు హెచ్చరికలు పంపుతున్నారు. స్థానిక నాయకుల ప్రమేయం లేకుండా మద్యం దుకాణాలు ఎలా నడుపుతారో చూస్తామని తెగేసి చెప్పుతున్నట్లు వినికిడి. మండలంలో మద్యం షాపుల వాటాలు, బెల్ట్‌షాపుల తతంగం అంతా పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్లు కూటమి నాయకులే చెబుతున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన మద్యం నూతన పాలసీకి కూటమి నాయకులే తూట్లు పొడవడం అధినాయకత్వానికి తలనొప్పిగా మారిందని ఆ పార్టీ నాయకులే చెప్పుకోవడం గమనార్హం.

పనిచేయని ఆధార్ కిట్

మొదటి రోజు 48 మందికి మాత్రమే నమోదు

విస్సన్నపేట: మండలంలోని ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రంలో కిట్ మొదటి రోజు మాత్రమే పనిచేసింది. మిగిలిన మూడు రోజులు పనిచేయలేదు. శుక్రవారంతో ప్రత్యేక శిబిరం ముగియడంతో ప్రజలు నిరాశకు గురయ్యారు. ఆధార్ నమోదు, సవరణలు, ఇతర ఇబ్బందులకు సంబంధించి స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఈనెల 22వ తేదీన ఆధార్ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మండల ప్రజలందరికీ సంబంధించి ఒక్కచోట మాత్రమే శిబిరం ఏర్పాటు చేయడంతో ప్రజలు అధికసంఖ్యలో శిబిరానికి వచ్చారు. మొదటి రోజు 48 మందికి ఆధార్ నమోదు చేశారు. తర్వాతి రోజు నుంచి సాఫ్ట్‌వేర్ సమస్యతో పని చేయలేదు. దీనిపై నిర్వాహకులు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదు. దూరాభారం నుంచి వ్యయప్రయాసలు పడి వచ్చిన ప్రజలు నిరాశతో వెనుతిరిగారు. ఆధార్ నమోదు శిబిరం తమ గ్రామాల్లోనే ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉండేదని, మండలం అంతా కలిపి ఒక్కచోటే నిర్వహించడం వల్ల ఫలితం లేదని పలువురు విమర్శించారు. దీనిపై ఎంపీడీఓ చేకు చిన్నరాట్నాలును వివరణ కోరగా సాఫ్ట్‌వేర్ సమస్యతో ఆధార్ శిబిరం మూడు రోజులు పనిచేయలేదని చెప్పారు.

- **నూజివీడు:** ఆధార్ ప్రత్యేక శిబిరాలు మండలంలో శుక్రవారంతో ముగిశాయి. పట్టణంలోని నాలుగో సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ ప్రత్యేక శిబిరానికి ప్రజలు విచ్చేసి ఆధార్ కార్డుల్లో సవరణలు చేసుకున్నారు. ముఖ్యంగా పాఠశాలలో ఆపార్ రిజిస్ట్రేషన్ జరుగుతుండటంతో ఆధార్‌లో తప్పులుంటే సైట్ పేర్లను తీసుకోవడం లేదు. దీంతో అధికశాతం మంది విద్యార్థులే ఆధార్ ప్రత్యేక శిబిరాలకు విచ్చేసి తమ పేర్లలోని అక్షర దోషాలను సవరించుకున్నారు. మండలంలోని పాతరావిచర్ల, మొర్సపూడి, గొల్లపల్లి, సీతారామపురంలలో ఆధార్ ప్రత్యేక శిబిరాలను నిర్వహించారు.

ఇసుక సీనరేజీ వసూలుపై ఫిర్యాదు

తిరువూరు: గానుగపాడు కట్టిలేరు వాగులో ఉచిత ఇసుక తీసుకు వెళ్లే వారి నుంచి సీనరేజీ వసూలు చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి కేఎస్ జవహర్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన స్వగ్రామమైన గానుగపాడులో కొందరు వ్యక్తులు తన అనుచరులుగా చెబుతూ సొంత అవసరాలకు ఇసుక తరలించే ట్రాక్టర్ల నుంచి సీనరేజీ వసూలుకు పాల్పడుతున్నారని జవహర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. తిరువూరు నియోజకవర్గంలో తన పేరు చెప్పి ఎవరైనా వసూళ్లకు, అక్రమాలకు పాల్పడితే తనకు తెలియజేయాలని కోరారు.

వేతన బకాయిలు చెల్లించాలని వినతి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మున్సిపల్ కార్మికులకు ఐదు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు మున్సిపల్ కమిషనర్ పి.శ్రీనివాసరావును కోరారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన కమిషనర్ శ్రీనివాసరావు నవంబర్‌లో నాలుగు నెలల వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. రక్షణ పరికరాలు, యూనీఫాం అందజేస్తామని చెప్పారు.

డ్వాక్రా సంఘాల అర్బన్ మార్కెట్ ఏర్పాటు

ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలోని మెప్మా ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాల మెప్మా అర్బన్ మార్కెట్‌ను ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ వద్ద శుక్రవారం ఏర్పాటు చేశారు. డ్వాక్రా సంఘాల సభ్యులు స్వయంగా తయారు చేసిన వివిధ రకాల పచ్చళ్లు, పిండి వంటలు, కొండపల్లి బొమ్మలు తదితర ఉత్పత్తులతో పాటు బయట మార్కెట్‌లో లభించే వివిధ రకాల వస్తువులను ప్రదర్శించి విక్రయించారు. పురపాలక సంఘం సిటీ మిషన్ మేనేజర్ శ్రీధర్ మాట్లాడుతూ డ్వాక్రా సభ్యులు బ్యాంకుల ద్వారా పొందిన రుణాలతో పలు రకాల ఉత్పత్తులు తయారు చేసి తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని చెప్పారు. వారి వ్యాపారాభివృద్ధికి అర్బన్ మార్కెట్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ పి.శ్రీనివాసరావు, పలువురు ఆర్పీలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నూజివీడు: స్థానిక పురపాలక సంఘ కౌన్సిల్ అత్యవసర సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ రామిశెట్టి త్రివేణీ దుర్గ అధ్యక్షతన జరిగే సమావేశానికి కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

అడుగడుగునా గుంతలు

వాహన చోదకుల ఇబ్బందులు



ఆరుగొలనుపేట ఆర్అండ్‌బీ రోడ్డుపై గుంతలు

చాట్రాయి: మండలంలోని ఆర్అండ్‌బీ రోడ్లు అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై పడిన పెద్ద పెద్ద గుంతల్లో నీరు నిలిచిపోవడంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. చాట్రాయి నుంచి ఆరుగొలనుపేట గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ రోడ్డు అడుగడుగునా గుంతలతో దర్శనమిస్తోంది. ఈ రోడ్డుపై చీకట్లో ప్రయాణాలు సాహసోపేతంగా మారుతున్నాయి. రెండు కిలో మీటర్ల రోడ్డుపై ప్రయాణం అరగంట పడుతుందని వాహన చోదకులు వాపోతున్నారు. చనుబండ నుంచి నరసింహారావుపాలెం రోడ్డులో పడిన పెద్ద పెద్ద గుంతల నుంచి ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించే క్రమంలో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. చనుబండలో కొర్లమండ రోడ్డుపై పడిన గుంతలో నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోందని కాలనీవాసులు చెబుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహన చోదకులు, ప్రజలు కోరుతున్నారు.

పబ్బతివాని చెరువులో ఆక్రమణలు

- నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ప్రహరీ నిర్మాణం
- పనులు నిలిపివేయించిన తహసీల్దార్



కొండపల్లి పబ్బతి వాని చెరువులో కబ్జా చేసిన స్థలంలో నిర్మించిన గోడ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి పబ్బతివాని చెరువులో యథేచ్ఛగా ఆక్రమలు జరుగుతున్నాయి. 30వ నంబర్ జాతీయ రహదారి పక్కనే ఉన్న స్థలానికి విపరీతమైన డిమాండ్ ఉండటంతో అక్రమార్కుల కన్ను స్థలంపై పడింది. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి స్థలాన్ని హస్తగతం చేసుకునేందుకు కుయుక్తులు పన్నుతున్నారు. సుమారు 8 ఎకరాల విస్తీర్ణం కలిగిన చెరువు స్థలంలోని కొంత భాగంలో 30వ నంబర్ జాతీయ రహదారి నిర్మాణం జరిగింది. కొంత స్థలంలో హిందూ శ్మశానవాటిక, రజకుల దోబీఖానా, డంపింగ్‌యార్డ్ ఉన్నాయి. మిగిలిన ప్రాంతంలో నూతన బస్టాండ్ నిర్మాణానికి గత ప్రభుత్వంలో ఏర్పాట్లు జరిగాయి. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో కూటమి నాయకుల కన్ను ఈ స్థలంపై పడింది. ఓ మహిళ పేరుతో స్థలం కబ్జా చేయాలని చూస్తున్నారు. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ప్రహరీ నిర్మాణం చేపట్టారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రస్తుతం స్థలం వద్ద జరుగుతున్న పనులను ఆపివేయించారు.

సారా తాగి వ్యక్తి మృతి

ఆగిరిపల్లి: స్థానిక స్టేట్ బ్యాంక్ సమీపంలో సింగన్నగూడేనికి చెందిన ఓ వ్యక్తి సారా తాగి మృతి చెందాడని స్థానికులు తెలిపారు. ఆ వ్యక్తి సారా తాగి రోడ్డుపై మృతి చెంది ఉండటాన్ని గమనించి కుటుంబ సభ్యులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు తీసుకువెళ్లారు.

విచ్చలవిడిగా సారా అమ్మకాలు

స్థానిక విజయవాడ రోడ్డులో విచ్చలవిడిగా సారా అమ్మకాలు జరుగుతున్నాయి. ఎక్సైజ్ పోలీసులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు స్పందించి సారా అమ్మకాలను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

రామాలయానికి ఫ్యాన్ బహూకరణ

మైలవరం: మైలవరం నూజివీడు రోడ్డులోని కోదండ రామాలయం దేవస్థానానికి స్థానిక జూలూరు నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు సీలింగ్ ఫ్యాన్‌ను శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యాన్ డ్రైవర్‌కు జైలు, జరిమానా

నూజివీడు: వ్యాన్‌ను వేగంగా, నిర్లక్ష్యంగా నడిపి ఒక వ్యక్తి మృతికి, మరో వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యేందుకు కారణమైన కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం తేలప్రోలుకు చెందిన డ్రైవర్ తోట కనకారావుకు మూడు నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ఏలూరు జిల్లా పెదపాడు మండలం పెదారవీడుకు చెందిన కురమ జాక్విన్, చట్టుమాల భాను 2018 జనవరి 20న ఉంగుటూరు మండలం తేలప్రోలులోని వివాహ కార్యక్రమానికి ద్విచక్ర వాహనంపై బయలు దేరారు. వీరు బాపులపాడు మండలం ఆరుగొలను వద్దకు చేరుకునే సరికి ఎదురుగా వేగంగా, నిర్లక్ష్యంగా వస్తున్న వ్యాను ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న కురమ జాక్విన్ తలకు తీవ్ర గాయమవడంతో అక్కడికక్కడే మృతిచెందగా వెనుక కూర్చున్న భానుకు కుడి కాలు, కుడి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై హనుమాన్ జంక్షన్ పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ వేశారు. కేసు విచారణ అనంతరం న్యాయమూర్తి నిందితుడికి పై విధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

కార్నియాల సేకరణ



ప్రభాకరరావు (ఫైల్)

తిరువూరు: అనారోగ్యంతో మృతిచెందిన తిరువూరు సెయింట్ థామస్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ సీడీ ప్రభాకరరావు నేత్రాలను కుటుంబ సభ్యులు లయన్స్ క్లబ్‌కు దానమిచ్చారు. గురువారం ఆయన మృతిచెందగా కుటుంబ సభ్యుల సమ్మతితో తిరువూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి వెంకటేశ్వరరావు సమక్షంలో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యులు కార్నియాలు సేకరించారు. లయన్స్ క్లబ్ సభ్యుడైన ప్రభాకరరావు మృతికి పలువురు సంతాపం తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



తిరువూరు: అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా తిరువూరు పోలీసులు శ్రీ చైతన్య స్కూల్‌లో విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోలీసుల విధులపై అవగాహన కల్పించేందుకు ఈ పోటీలు నిర్వహించామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. విద్యార్థులకు పోలీసు శాఖ పనిచేసే విధానాన్ని వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఇబ్రహీం, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

పశుగణనకు రైతులు సహకరించాలి



వావిలాలలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పశువైద్యాధికారి శ్వేత, రైతులు

తిరువూరు: పశువుల యజమానులు తమ జీవాల వివరాలను ఎన్యూమరేటర్లకు అందజేయాలని తిరువూరు మండల పశువైద్యాధికారి శ్వేత కోరారు. జాతీయ పశుగణన కార్యక్రమాన్ని వావిలాల గ్రామంలో శుక్రవారం ఆమె ప్రారంభించి మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు చేశారు. పశుగణనతో యజమానులకు అన్ని విధాలా ప్రయోజనాలున్నాయని, పశువులకు బీమా సదుపాయం, ప్రభుత్వం ద్వారా రుణాలు, ఇతర సంక్షేమ పథకాలకు ఈ గణన ఉపయోగపడుతుందని చెప్పారు. మల్లేలలో కూడా పశుగణన కార్యక్రమాన్ని లైవ్ స్టాక్ అధికారి గోపాలకృష్ణ ప్రారంభించారు. పశుగణన కార్యక్రమ ప్రాధాన్యతను వివరిస్తూ ప్రచార వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు.

- **కీర్తిరాయునిగూడెం(మైలవరం):** గ్రామాల్లో జరిగే పశు గణన కార్యక్రమానికి రైతులు సహకరించాలని మాజీ జెడ్పీటీసీ దొండపాటి రాము అన్నారు. కీర్తిరాయునిగూడెం గ్రామంలో పశు వైద్యశాల అధికారుల సమక్షంలో అఖిల భారత పశు గణన పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ దివ్య, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

కొండపల్లిలో ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు



కొండపల్లిలో ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): వైఎస్సార్ సీపీ కొండపల్లి పట్టణ అధ్యక్షుడు మిక్కిలి శరభయ్య ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పలువురు పట్టభద్రులు ఆఫ్‌లైన్‌లో తమ ఓట్లను నమోదు చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పశ్చిగోళ్ల పండు, మిక్కిలి శరభయ్య మాట్లాడుతూ 2021లోగా డిగ్రీ పూర్తి చేసిన వారందరూ నవంబర్ 6వ తేదీలోగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో సంబంధిత సర్టిఫికెట్లు జతచేసి ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా విడుదల చేస్తారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎంఏ బేగ్, కాంద్రకొండ శ్రీను, కాంద్రకొండ గురవయ్య, వసంతరావు, షేక్ బుడే, రాజేష్, చంటి, మల్లికార్జునరావు, రాణి తదితరులు పాల్గొన్నారు.

- **మైలవరం:** యూటీఎఫ్ మైలవరం మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహించారు. మండల శాఖ ప్రధాన కార్యదర్శి వాడపల్లి వసంతరావు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.గంగరాజు, మైలవరం మండల ప్రధాన కార్యదర్శి వసంతరావు, నాయకులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 56 మందికి ఉద్యోగాలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు



ఎంపికైన విద్యార్థులతో వాహినీ కళాశాల అధ్యాపకులు

నూజివీడు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 56 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా ఉపాధి అధికారి సి.మధుభూషణరావు తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్ మేళాను నిర్వహించారు. వరుణ్ మోటార్స్, నవతా ట్రాన్స్‌పోర్ట్, మెడ్‌ప్లస్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, డీమార్ట్ సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జాబ్‌మేళాకు 109 మంది హాజరు కాగా 56 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఐటీఐ కళాశాల ప్రధానాధికారి దేవరకొండ భూషణం, నైపుణ్యాభివృద్ధి సంస్థ సమన్వయ కర్తలు రవిశ్యామ్, సురేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- **తిరువూరు:** స్థానిక శ్రీ వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం బీటెక్ నాలుగో సంవత్సరం విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. హైదరాబాద్ కెరీర్ బ్రిడ్జ్ ఐటీ సర్వీసెస్ సంస్థ నిర్వహించిన ఎంపిక పరీక్షలో 11 మందికి ఉద్యోగావకాశాలు లభించాయని ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు తెలిపారు. మూడు నెలల శిక్షణ అనంతరం నియామకాలు జరుపుతారన్నారు. కార్యక్రమంలో కోశాధికారి కిశోర్, క్యాంపస్ సెలక్షన్ విభాగ అధ్యాపకులు షరీఫ్, సత్యప్రసాద్ పాల్గొన్నారు.

మైలవరం గ్రామ సభలో 40 అర్జీల స్వీకరణ



చొప్పరమెట్లలో అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ ప్రసాద్

మైలవరం: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తోందని, ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మైలవరం తహసీల్దార్ జి. బాలకృష్ణారెడ్డి అన్నారు. మైలవరం తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సభకు మొత్తం 40 అర్జీలు వచ్చాయి. డిప్యూటీ తహసీల్దార్ శ్రీహరి, సర్పంచ్, మండల రెవెన్యూ అధికారి, గ్రామ సర్వేయర్ పాల్గొన్నారు.

చొప్పరమెట్ల సభకు 18 దరఖాస్తులు..

- **ఆగిరిపల్లి:** రీ సర్వేపై వచ్చిన సమస్యలకు గ్రామ సభలో పరిష్కారం చూపుతామని తహసీల్దార్ కేఎస్వీ ప్రసాద్ అన్నారు. మండలంలోని చొప్పరమెట్లలో గ్రామసభ నిర్వహించి 18 అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ రైతులు తమ సమస్యలను అర్జీల రూపంలో అందిస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్, సర్పంచ్ కూరాకుల ఊర్మిళ, డిప్యూటీ తహసీల్దార్ మరియన్న, ఆర్ఐ యూనస్, మండల సర్వేయర్ గంగరాజు పాల్గొన్నారు.

నమ్మండి.. క్రీడా ప్రాంగణమేనండి!



ఆట స్థలంలో ఉన్న తుప్పలు



టాయిలెట్స్ చుట్టూ ఉన్న తుప్పలు

చాట్రాయి: చనుబండ జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణం ముళ్ల తుప్పలతో అడవిని తలపిస్తోంది. తుప్పల మాటున విష సర్పాలు ఉండొచ్చని విద్యార్థులు భయాందోళనకు గురవుతూ ఆటలకు దూరమవుతున్నారు. మరో పక్క టాయిలెట్స్ చుట్టూ పొదలు ఉండటంతో భయం భయంగా వెళ్లాల్సి వస్తోంది. అధికారులు స్పందించి ఆట స్థలం, టాయిలెట్స్ చుట్టూ ఉన్న ముళ్ల పొదలను తొలగించాలని విద్యార్థులు కోరుతున్నారు.